# బీసీల అభ్యున్నతి కేసీఆర్‌తోనే సాధ్యం


లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎంపీపీ అరుణా రాంబాబు

- ఎంపీపీ అరుణా రాంబాబు
- చేతివృత్తిదారులకు చెక్కుల పంపిణీ

మరిపెడ, అక్టోబర్ 8: చేతివృత్తిదారుల అభ్యున్నతి సీఎం కేసీఆర్ ప్రభుత్వంతోనే సాధ్యమని మరిపెడ ఎంపీపీ గుగులోత్ అరుణా రాంబాబు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం రూ.1లక్ష విలువ కలిగిన బీసీబంధు చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ తోడ్పాటుతో మొదటి, రెండో విడుతల్లో రూ.4కోట్ల 88 లక్షల విలువ కలిగిన చెక్కులు మంజూరైనట్లు వెల్లడించారు. మొదటి విడుతలో దళితబంధు పథకం ద్వారా రూ.10కోట్లతో 100 మందికి చెక్‌లు పంపిణీ చేశామన్నారు. సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్న బీఆర్ఎస్ సర్కార్‌ను ప్రజలు దీవించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుగులోత్ వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్‌గా అనిల్ కుమార్



నెల్లికుదురు, అక్టోబర్ 8 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్‌గా వృక్ష శాస్త్ర అధ్యాపకుడు మర్సకట్ల అనిల్ కుమార్‌ను నియమిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో అనిల్ కుమార్ తొర్రూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వర్తించారు. అక్కడ జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రోగ్రాం ఆఫీసర్ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రిన్సిపాల్, అధ్యాపక, బోధనేతర సిబ్బంది సహకారంతో కళాశాల అభివృద్ధి, సమాజసేవకు పాటుపడతానని తెలిపారు.


సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రెడ్యానాయక్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

## సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రెడ్యానాయక్ చిత్రపటానికి క్షీరాభిషేకం

డోర్నకల్, అక్టోబర్ 8 : ఉయ్యాలవాడ గ్రామంలో దళిత బంధు 9 యూనిట్లు వచ్చిన సందర్భంగా సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రెడ్యానాయక్ చిత్రపటానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నున్న రమణ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, దళిత నాయకులు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే రెడ్యా నాయక్ దళితుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు రానున్న ఎన్నికల్లో ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్ సబ్బండ వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలన్నారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఏఎంసీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, ఎంపీటీసీ నున్న మల్లికార్జున్, సర్పంచ్ నున్న జయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ చేర్నెడ్డి భిక్షంరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నున్న జగన్ తదితరులు పాల్గొన్నారు.



బొజ్జన్నపేటలో ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న రాకేశ్

## 'ఆయిల్ పామ్' రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

నర్సింహులపేట, అక్టోబర్ 8 : ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తొర్రూరు డివిజన్ ఉద్యానశాఖాధికారి సీహెచ్ రాకేశ్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు, బొజ్జన్నపేట గ్రామంలో ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్ల క్రితం సాగు చేసిన ఆయిల్ పామ్‌లో ప్రస్తుతం కాయలు కాస్తున్నాయన్నారు. 5 ఎకరాలలోపు భూమి ఉన్న రైతులు ఉపాధి హామీ జాబ్ కార్డు, ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం రాయితీలు ఇవ్వడం జరుగుతుంది. ఉద్యాన శాఖ ద్వారా ఒక ఎకరానికి మొక్కలపై రాయితీ 11 వేలు, నిర్వహణ ఖర్చు 4ఏళ్ల వరకు రూ.16, 800 చెల్లించడం జరుగుతుందన్నారు. డ్రిప్ పరికరాలపై గరిష్ఠంగా రూ. 21 వేలు రాయితీ అందించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా మట్టి పరీక్షకు రూ. 272, గుంతలు తీయడానికి ఎకరానికి 4,000, మొక్కకు కర్రల (ఊతం) ఏర్పాటు రూ. 1000, మొక్కల రవాణ ఖర్చు రూ. 1,140, మొక్కల పెంపకం కోసం ఎకరానికి ఏడాదికి రూ. 6,840 అందిస్తున్నామన్నారు. పూర్తి వివరాలను 79977 25109 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## సునీల్‌రెడ్డికి సన్మానం

పెద్దవంగర, అక్టోబర్ 8: మండలంలోని చిన్న వంగర గ్రామానికి చెందిన ఎన్నారై, బీఆర్ఎస్ నాయకుడు పాకనాటి సునీల్‌రెడ్డి ఇటీవల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో పార్టీలో చేరారు. ఆదివారం బంగారు చెలిమె తండాకు చెందిన బీఆర్ఎస్ నేతలు సునీల్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్బీఎస్ మండల కన్వీనర్ సోమారెడ్డి, ఉప సర్పంచ్ బాలూనాయక్, బీఆర్ఎస్ నాయకులు విజయపాల్‌రెడ్డి, శేఖర్, దేవేందర్, వెల్మా, నవీన్, తండా నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సునీల్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## నేడు మెగా జాబ్ మేళా

మహబూబాబాద్, అక్టోబర్ 8 : జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మెగా జాబ్‌మేళాను సోమవారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే శంకర్‌నాయక్ వెల్లడించారు. న్యూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సూర్య చంద్ర ట్రస్ట్ ద్వారా జాబ్‌మేళాలో సుమారు 70 ప్రముఖ కంపెనీలతో 2,500పైగా ఉద్యోగాలు కల్పించనునున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ జాబ్ మేళా సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు. నేరుగా నిర్వహించే ఇంటర్వ్యూ ద్వారా విద్యార్హతను బట్టి ఉద్యోగాల్లో నియమిస్తారన్నారు. ఈ మేళాలో ఐటీ కంపెనీలు, బ్యాంకింగ్ జాబ్స్, లాజిస్టిక్స్, నర్స్ ఉద్యోగాలు, వీడియో ఎడిటర్స్, మార్కెటింగ్ జాబ్, కస్టమ్స్ కంపెనీ జాబ్స్, ఫార్మసీలో ఉద్యోగాలు, హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఉద్యోగాలు, సాఫ్ట్‌వేర్, స్కూల్ స్టాఫ్, సెక్యూరిటీ జాబ్స్, అడ్వర్టయిజింగ్ ఉద్యోగాలు ఉంటాయన్నారు. ఈ మేళాలో పాల్గొనే వారు మల్టిపుల్ జిరాక్స్ కాపీల రెజ్యూమ్ డైరెక్టుగా ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కాగా, టెన్త్ చదివిన వారి నుంచి ఎంటెక్, ఎంఫార్మ్, ఎంబీఏ, ఎంసీఏ, ఎనీ3ఇయర్స్ పీజీ, బీటెక్, బీఏ, బీకామ్, బీఎస్సీ, ఇంటర్, ఐటీఐ చదివిన వారు అర్హులన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

### యువత సద్వినియోగం చేసుకోవాలి

కేసముద్రం : జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు తొనుపునూరి సాయి ఆదివారం ఒక్క ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఎమ్మెల్యే శంకర్‌నాయక్ కృషి చేస్తున్నారన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని సూచించారు.

## కోతుల దాడిలో ఒకరికి గాయాలు

కేసముద్రం, అక్టోబర్ 8 : మండలంలోని కల్వల గ్రామానికి చెందిన దయ్యాల సాయిలు ఆదివారం ఇంటి వద్ద ఆరుబయట ఉండగా కోతులు దాడి చేశాయి. దీంతో సాయిలు చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను చికిత్స కోసం మహబూబాబాద్ తరలించారు.


తొర్రూరు బస్టాండ్‌లో అన్నదానం చేస్తున్న సేవా తరుణి సభ్యులు

## సేవా తరుణి ఆధ్వర్యంలో అన్నదానం

తొర్రూరు, అక్టోబర్ 8 : అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న అని పీడీజీ తమ్మెర లక్ష్మీనరసింహారావు, రీజియన్ చైర్ పర్సన్ డాక్టర్ వీ శారద అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని బస్టాండ్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్ జిల్లా గవర్నర్ ఎన్ వెంకటేశ్వర్‌రావు సారథ్యంలో ఉచిత అల్పాహార కార్యక్రమం 365 డేస్ జరపాలని నిర్ణయించారు. రీజియన్ వైజ్‌గా నాలుగు ఏరియాల్లో జూలై నుండి ప్రారంభించారు. లయన్స్ క్లబ్ తొర్రూరు సేవా తరుణి ద్వారా అల్పాహార కార్యక్రమం క్లబ్ అధ్యక్షురాలు వజినపల్లి శైలజ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. వందో రోజు పూర్తి చేసుకున్న సందర్భంగా బస్టాండ్‌లో అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి దాతలు క్లబ్ ప్రధాన కార్యదర్శి తుమ్మూరు శ్రీదేవిరెడ్డి–వెంకటరెడ్డి దంపతుల ఆర్థిక సాయంతో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో హంగర్ రిలీఫ్ కో–ఆర్డినేటర్ దామెర సరేశ్, సేవా తరుణి ట్రెజరర్ సోమ రజని, తరుణి సభ్యులు, వివిధ క్లబ్బుల పీఎస్‌టీలు తదితరులు పాల్గొన్నారు.


బాలగోపాల్‌కు నివాళులర్పిస్తున్న ప్రజాపంథా నాయకులు

## డాక్టర్ బాలగోపాల్‌కు ఘన నివాళి

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 8 : మానవ హక్కుల వేదిక నాయకులు డాక్టర్ బాలగోపాల్ వర్ధంతిని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల సాధనకు బాలగోపాల్ నిరంతరం పోరాడారన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగ్గన్న, సూర్యం, సత్యం, యాకయ్య, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సుభిక్ష పాలన

- చిన్నారి నుంచి వృద్ధుల వరకు అందుతున్న సంక్షేమ ఫలాలు
- జిల్లా గ్రంథాలయం చైర్మన్ నవీన్‌రావు

మరిపెడ, అక్టోబర్ 8: సీఎం కేసీఆర్ సుభిక్ష పాలనలో శిశువుల నుంచి వృద్ధుల వరకు వివిధ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని జిల్లా గ్రంథాలయ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని బీచ్‌రాజ్ పల్లి గ్రామంలో బతుకమ్మ కానుకగా మహిళలకు ప్రభుత్వం అందజేసిన చీరెలతో పాటు గృహలక్ష్మి మంజూరి పత్రాలను స్థానిక సర్పంచ్ నాతి కృష్ణతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళా సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం కల్యాణలక్ష్మి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత సుఖ ప్రసవాలు, ఐసీడీఎస్ అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందజేస్తుందన్నారు. మహిళల సాధికారత కోసం గ్రామైక్య సంఘాల ద్వారా తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తూ అండగా నిలుస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌రాజుపల్లిలో బతుకమ్మ చీరెలు పంపిణీ చేస్తున్న నవీన్‌రావు
